సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 21 । జనవరి । 2023



ప్రభుత్వ జాగాపై..

నరసన్నపేటలో డీసీఎంఎస్ స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. అధికారులు దీన్ని కాపాడే పనిలో పడ్డారు. - IIలో



ఆట అదుర్స్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు అదుర్స్ అనిపించాయి. శ్రీకాకుళంలో పోటీలు జరిగాయి. - IIలో

స్కోచ్ అవార్డుల రేసులో పోలీసు శాఖ ముందంజ

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డుల నామినేషన్లలో రెండు విభాగాల్లో ముందంజలో ఉంది. ఈ మేరకు పోలీసు శాఖ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. విద్యార్థుల కోసం రూపొందించిన క్యాంపస్ కాప్స్, నాటుసారా నిర్మూలన కోసం అమలు చేసిన ఆపరేషన్ పరివర్తన్ ప్రాజెక్టులను స్కోచ్ అవార్డుల కోసం ప్రతిపాదించగా.. అవి సెమీఫైనల్‌కు ఎంపికయ్యాయి.

ధాన్యానికి దక్కిన భరోసా

[మిల్లర్ల మాయ లేదు .. దళారుల దందా లేదు]

రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

- 21 రోజులకు ముందే పడుతున్న డబ్బులు
- జిల్లాలో ఇప్పటికే రూ.532 కోట్లకు పైగా చెల్లింపులు
- సంచులు, రవాణా, హమాలీ చార్జీలు సైతం జమ చేస్తున్న ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ధాన్యం కొనుగోలుపై రైతుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. రికార్డు స్థాయిలో కొనుగోలు చేయడమే కాకుండా నిర్దేశిత సమయం కన్న ముందే చెల్లింపులు చేయడంతో రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. ఇచ్ఛాపురం నియోజకవర్గం మినహా ప్రతి చోటా కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగుతోంది. జిల్లాలో ఇప్పటికే 3లక్షల 33వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. దాదాపు రూ.532కోట్లు మేర రైతుల ఖాతాలకు జమ చేసింది. హమాలీ, గన్ని, రవాణా చార్జీలు సైతం రైతులకు అందజేయడంతో సంతోషం వ్యక్తమవుతోంది. దళారులకు అవకాశం లేకుండా, మిల్లర్లు ప్రమేయం లేకుండా నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడంతో రైతులు తిప్పలు పడాల్సిన అవసరం లేకుండా పోయింది.

లక్ష్యానికి మించి కొనుగోలు..

జిల్లాలో ధాన్యం కొనుగోలు నిరాటంకంగా కొనసాగుతోంది. విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ప్రతి రైతు దగ్గరి నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. 21 రోజుల్లో చెల్లింపులు చేస్తామని ప్రభుత్వం ముందు చెప్పినా అంతకుముందే ధాన్యం సొమ్ముతో పాటు రవాణా, హమాలీ, సంచుల చార్జీలను రైతుల ఖాతాలకు జమ చేస్తోంది.

- జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,53,060 హెక్టార్లలో వరి సాగైంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి పంట పండింది.
- సుమారు 8,11,120 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్టుగా అధికారులు అంచనా వేశారు.
- ఇందులో రైతుల అవసరాలు, ఇతర అవసరాలకు మినహాయించగా 4లక్షల 30వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం మొదట భావించింది.
- కానీ దిగుబడి ఎక్కువగా ఉండటంతో రైతుల అవసరాలు పోను ప్రభుత్వం నిర్దేశించిన దానికంటే ధాన్యం అందుబాటులో ఉండటంతో ఈసారి కొనుగోలు లక్ష్యం కూడా ప్రభుత్వం పెంచుకుంది.
- రైతు దగ్గర ఉన్న చివరి గింజను సైతం కొనుగోలు చేస్తామని ప్రకటించింది. దానిలో భాగంగా ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న 605 రైతు భరోసా కేంద్రాల కొనుగోలు ప్రక్రియ కొనసాగించేందుకు ఇప్పటికే చర్యలు తీసుకుంది. దీంతో జిల్లాలో ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి.

మధ్యవర్తుల ప్రమేయం లేకుండా..



గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి కొనుగోళ్లు జరిగాయి. దళారులకు ఎక్కడా ఆస్కారం లేకుండా పోయింది. మిల్లర్ల జోక్యానికి తావివ్వలేదు. రైతు భరోసా కేంద్రాల ద్వారానే కొనుగోళ్లు జరగడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. తరుగు అని, తేమ శాతమని, ధర తగ్గిందనే వాదనలకు అవకాశం ఇవ్వకుండా కొనుగోళ్లు చేపట్టారు. అక్కడక్కడ ఒకరిద్దరు మిల్లర్లు తమదైన శైలిలో జిమ్మిక్కు చేద్దామని ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదు. ఎప్పటికప్పుడు అధికారులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవడంతో మిల్లర్లు సైతం సాహసించే ప్రయత్నం చేయలేదు. ప్రభుత్వం చెప్పినట్టుగా ధాన్యం సేకరణకు సహకరించారు. గతం కంటే ఈ ఏడాది వేగంగా కొనుగోళ్లు జరిగాయి.

రూ. 532కోట్లకు పైగా చెల్లింపు..

జిల్లాలో 72,998 మంది రైతులకు సంబంధించి ఇప్పటివరకు 3లక్షల 33వేల 238 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసింది. వాటి విలువ రూ. 679.82కోట్ల వరకు ఉంది. వీటిలో ఇప్పటికే రూ.532కోట్ల మేర ప్రభుత్వం చెల్లింపులు చేసింది. ఇవి కాకుండా రూ.కోటిన్నర వరకు సంచుల కింద, హమాలీ చార్జీల కింద రూ.40లక్షలు, రవాణా చార్జీల కింద కోటిన్నర చెల్లింపులు చేసింది. హమాలీ, సంచులు, రవాణా చార్జీల కింద ప్రతీరోజు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది.

ఇచ్ఛాపురంలో ఇబ్బందులు

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో మిల్లుల కొరత, సామర్థ్యం తక్కువగా ఉన్న కారణంగా కొనుగోలులో ఇబ్బందులు తలెత్తాయి. దూర ప్రాంతాల్లో ఉన్న మిల్లులకు అనుసంధానం చేసినప్పటికీ అక్కడి నుంచి తరలించేందుకు రైతులు ఆసక్తి చూపకపోవడంతో కొనుగోళ్లు శరవేగంగా సాగడం లేదు. వాస్తవంగా ప్రభుత్వమే రవాణా చార్జీలు, హమాలీ చార్జీలను భరిస్తుంది. ఈ విషయంపై అవగాహన కొరవడటంతో రైతులు వ్యయప్రయాసలకు లోనవుతున్నామని వెనక్కి తగ్గుతున్నారు. దీనిపై జేసీ నవీన్ ఇప్పటికే స్పందించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా సదుపాయాలు కల్పించి ధాన్యం కొనుగోలు చేసి, అందుబాటులో ఉన్న మిల్లులకు చేరవేస్తామని హామీ ఇవ్వడమే కాకుండా తగు చర్యలకు శ్రీకారం చుట్టారు.

గత ఆరేళ్లలో కొనుగోళ్లు ఇలా..

2018జనవరి 20 నాటికి	2,46,310మెట్రిక్ టన్నులు(38మండలాలు)
2019 జనవరి 20 నాటికి	2,13,585మెట్రిక్ టన్నులు (38మండలాలు)
2020 జనవరి 20 నాటికి	2,49,612మెట్రిక్ టన్నులు (38మండలాలు)
2021 జనవరి 20 నాటికి	3,02,336మెట్రిక్ టన్నులు (38మండలాలు)
2022 జనవరి 20 నాటికి	1,46,834మెట్రిక్ టన్నులు (38మండలాలు) (కోతలు ఆలస్యంగా జరగడం వల్ల కొనుగోళ్లు తక్కువగా జరిగాయి.)
2023 జనవరి 20 నాటికి	3, 33,238 మెట్రిక్ టన్నులు (30 మండలాలు)



ఎనిమిది రోజుల్లో డబ్బులు పడ్డాయి



నందిగాం మండలం పెంటూరులో మా రైతు భరోసా కేంద్రానికి అనుసంధానం చేసిన రైసుమిల్లుకు ధాన్యం ఇచ్చాను. డిసెంబర్ 25వ తేదీన 28ధాన్యం బస్తాలు ఇవ్వగా, ఎనిమిది రోజుల్లో నా ఖాతాకు డబ్బులు పడ్డాయి. 28బస్తాలకు రూ.45,696 జమ అయ్యాయి. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం పెట్టిన కొత్త విధానం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.
– బోడ వెంకటరమణ, రైతు, పెద్ద తామరాపల్లి

గంటలో నగదు జమ



డిసెంబరు 13న సాయంత్రం యలమంచిలి మిల్లుకు 50 బస్తాల ధాన్యం పంపించాం. దాదాపు ఒక గంట సమయంలోనే ఖాతాలో రూ.81,600 జమైంది. అక్కడకు కొద్ది రోజుల్లోనే రవాణా, కూలీ ఖర్చులు, సంచులవి రూ.1400 కూడా డబ్బులు పడ్డాయి. ధాన్యం కొనుగోలుపై ఈ ఏడాది సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన నూతన విధానం రైతులకు చాలా మేలు కలుగుతోంది. – దామ మన్మధరావు, రైతు, పాగోడు

ఐదు రోజులకే డబ్బు వచ్చింది



నేను 2 వేల కేజీల ధాన్యం ఆర్‌బీకే ద్వారా విక్రయించాను. 21 రోజుల్లో డబ్బు వస్తుందని నా బ్యాంకు ఖాతా నంబరును తీసుకున్నారు. అయితే ధాన్యం ఇచ్చిన 5 రోజులకే నా ఖాతాకు డబ్బులు వచ్చాయి. చాలా ఆనందంగా ఉంది. అలాగే గోనె సంచుల డబ్బులు కూడా వేరేగా వచ్చాయి.
– పంచిరెడ్డి ఎర్రయ్య, గుండువల్లిపేట, నరసన్నపేట

ఈ విధానం బాగుంది



ధాన్యం సేకరణలో ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానం చాలా బాగుంది. రైతులకు చాలా ప్రయోజనకరంగా ఉంది. ప్రతి రైతుకూ ఎంతో మేలు జరుగుతుంది. మా కల్లాలకు వచ్చి ఆర్‌బీకే ఇన్‌చార్జిలు ధాన్యంను శాంపిల్స్ తీసుకొని ట్రక్ షీట్ ఇస్తున్నారు. నేరుగా రైతుల నుంచి ధాన్యం మిల్లులకు పంపిస్తున్నారు.
– ముంజి సత్యన్నారాయణ, జగన్నాథపురం, నరసన్నపేట

న్యూస్‌రీల్

ఫిబ్రవరి మొదటి వారంలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఉదయ్‌భాస్కర్ చెప్పారు. వర్సిటీ పరీక్షల నిర్వహణ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొదటి ఏడాది 8,900 మంది విద్యార్థులు చదువుతున్నారని, శుక్రవారం నాటికి 7,200 మంది పరీక్ష ఫీజులు చెల్లించారని అన్నారు. శుక్రవారంతో ఫీజులు చెల్లింపు సమయం పూర్తి కాగా, మరికొన్నాళ్లు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల షెడ్యూల్ త్వరలో ప్రారంభిస్తామని, ఉన్నత విద్యా మండలి అకడమిక్ క్యాలెండర్ మేరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

'ప్రైవేటు పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానం'



మాట్లాడుతున్న గురుగుబెల్లి నరసింహమూర్తి

శ్రీకాకుళం అర్బన్: ప్రైవేటు పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ చాలా అధ్వానంగా ఉందని బాలల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు గురుగుబెల్లి నరసింహమూర్తి అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో గల బాలల హక్కుల వేదిక కార్యాలయంలో శుక్రవారం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్య మరీ అధ్వానంగా ఉందని, అలాంటి పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో గదుల కెపాసిటీకి మించి విద్యార్థులను ఉంచుతున్నారని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు కూడా పాఠశాలల నిర్వహణ విధానంపై దృష్టి సారించాలని కోరారు. అక్షయ పాత్ర ద్వారా సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేదన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణం జరిగినప్పటికీ, మిగిలిన పాఠశాలల్లో మరుగు దొడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి రౌతు జ్యోతికుమారి, ఉపాధ్యక్షులు ఎల్.సంపతికుమారి, బి.సంతోష్, తాండ్ర శ్రీనివాస రావు, మూగి మహందాత పాల్గొన్నారు.

ట్యాబ్‌ల పనితీరుపై సమీక్ష



ట్యాబ్‌లతో విద్యార్థులు చదువుతున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని వప్పంగిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ ఆధ్వర్యంలో ఇటీవల ప్రభుత్వ పరంగా పంపిణీ చేసిన ట్యాబ్‌లపై ఆమె సమీక్షించారు. ముందుగా విద్యార్థులతో ట్యాబ్‌ల ఉపయోగం, వాటి వల్ల చదువుకునే విధానంపై అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు 25,953 ట్యాబ్‌లు పంపిణీ చేశారని, అందులో విద్యార్థులకు 22,982 ట్యాబ్‌లు, ఉపాధ్యాయులకు 2,971 ట్యాబ్ లు అందజేశామని తెలిపారు. వప్పంగిలో విద్యార్థులు ట్యాబ్‌లు ఉపయోగిస్తున్న తీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. బైజూస్ డీహెచ్‌ఓ ఎస్.జగదీష్ మాట్లాడుతూ ఈ ట్యాబ్‌ల ద్వారా మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జాగ్రఫీ, బయాలజీ, హిస్టరీ సబ్జెక్టు లు ఇంగ్లిష్, తెలుగు భాషల్లో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణారావు, ప్రధానోపాధ్యాయులు దాలినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగావళిలో మునిగి వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం పట్టణంలోని దమ్మలవీధి గోల్కొండ రేవులో జనుమూరి నాగరాజు (42) అనే వ్యక్తి నాగావళి నదిలో మునిగి చనిపోయారు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16న వేకువజామున దమ్మలవీధికి చెందిన జనుమూరి నాగరాజు బహిర్భూమి కోసం గోల్కొండ రేవు వద్దకు వెళ్లారు. వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. భార్య, కుటుంబసభ్యులు పనిమీద ఎక్కడికో వెళ్లి ఉంటాడని భావించారు. శుక్రవారం సాయంత్రం నాగావళి నదిలో గుర్తు పట్టలేని విధంగా ఓ మృతదేహం బయటపడింది. ఒకటో పట్టణ పోలీసులు విచారించగా అది నాగరాజు మృతదేహమని తెలిసింది. దీంతో వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.నాగరాజు భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

ఘనంగా మహా లింగార్చన



లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాసశివరాత్రిని పురస్కరించుకుని శివ పంచాయతన సహిత మహా లింగార్చన కార్యక్రమం శుక్రవారం ఉదయం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అనివెట్టి మండపంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ వేదమంత్రోచ్చరణల మధ్య లింగాభిషేకార్చనలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఆలయ సిబ్బంది, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

బోనుల ఏర్పాటు



మామిడి పల్లి పంచాయతీ పరిధిలో బోన్లు ఏర్పాటు చేసిన అధికారులు

సోంపేట: మండలంలోని మామిడిపల్లి, గొల్లూరు పంచాయతీల్లో ఇటీవల అటవీ జంతువులు దాడి చేయడంతో పదుల సంఖ్యలో పశువులు మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం ఆదేశాలు మేరకు అటవీ శాఖాధికారులు స్పందించి గ్రామాల పరిధిలో శుక్రవారం బోన్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖాధికారులు మాట్లాడుతూ హైనా పశువులపై దాడి చేస్తుందనే అనుమానం ఉందన్నారు. ఎఫ్ఆర్ఓ మురళీకృష్ణం నాయుడు, బారువ సెక్షన్ ఎఫ్ఎస్ఓ బి.విజయ శాంతిబాబు, ఎఫ్‌బీఓ సంతోష్, మందస సెక్షన్ డీవైఆర్ఓ రాము, పలువురు అటవీశాఖాధికారులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉత్తరాంధ్ర రచయితల సభ

కాశీబుగ్గ: ఉత్తరాంధ్ర కళలు, సాహిత్యం పరిరక్షించుకునే ప్రయత్నంలో భాగంగా ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో ఉత్తరాంధ్ర రచయితల సభ నిర్వహిస్తున్నట్లు ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు లండ రుద్రమూర్తి ప్రకటనలో తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఎస్ఎంసి ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం జరుగుతుంది. ఈ మహా సభల్లో ప్రముఖ సినీ గేయ రచయిత, లోక కవి డాక్టర్ అందెశ్రీ, ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

అలంకార ప్రియునికి అభిషేక సేవ

అలంకార ప్రియుడైన వాసుదేవునికి అభిషేక సేవ కన్నుల పండువగా జరిగింది. మందసలో కొలువై ఉన్న వాసుదేవ పెరుమాళునికి శుక్రవారం అభిషేక మహోత్సవం నయన మనోహరంగా సాగింది. స్వామి జన్మనక్షత్రమైన మూలానక్షత్రయుత రోజున వేదమంత్రోచ్చరణల మధ్య అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. – మందస



స్వామివారిని అలంకరిస్తున్న అర్చకులు

వాసుదేవునికి అభిషేకం

పలాసలో ఆర్మీ క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్ సిబ్బందితో బ్రిగేడియర్ సోమశేఖర్

కాశీబుగ్గ: శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా యువతరం ఉన్నారని, సక్రమంగా చదువుకుని మేధస్సును ఉపయోగిస్తే ఉన్నతంగా స్థిరపడతారని హెడ్‌క్వార్టర్స్ తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా డిప్యూటీ జనరల్ ఆఫీసర్ బ్రిగేడియర్ కె.సోమశేఖర్ అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో చినబడాం ఐస్‌ఫ్యాక్టరీ సమీపంలో అద్దె భవనంలో ఏర్పాటు చేసిన ఆర్మీ క్యాంటీన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆర్మీ జవాన్లు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శ్రీకాకుళంవాసులు చాలా మంచివారని, క్రమశిక్షణతో పనిచేస్తారని శ్రీకాకుళం పట్టణం క్యాంటీన్ ప్రారంభానికి వచ్చినప్పుడు పలాస పరిసర ప్రాంత సైనిక కుటుంబాల ఆసక్తి చూశామని, అందరి సహకారంతో మూడు నెలల్లో ఏర్పాటు చేసి ప్రారంభించుకున్నామని అన్నారు. శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ వద్ద ఆర్మీ ఇంటిగ్రేటెడ్ భవనం సైతం నిర్మించుకుంటామని రాకపోకలు జరిపే సైనికులకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నామని తెలిపారు. పలాస రావడం సంతోషంగా ఉందన్నారు. గత ఆగస్టులో విశాఖలో జరిగిన ఆర్మీ ర్యాలీకి శ్రీకాకుళం జిల్లా నుంచి 19,760 యువకులు దరఖాస్తులు చేసుకోగా అందులో 285 మంది టెస్టులో పాసయ్యారని అన్నారు. అందులో జీడీకి 150 మంది, క్లర్క్ 10 మంది, ట్రేడ్స్‌మేన్స్‌కు 97 మంది ఎంపిక అయ్యారని అన్నారు. ర్యాలీలో 58 వేల మంది దరఖాస్తు చేసుకోగా 783 మంది మాత్రమే ఎంపికయ్యారని అన్నారు.

సాగుకు సలహా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు. చిత్రంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

- చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించాలి
- జిల్లా రైతులను ప్రోత్సహించే దిశగా చర్యలు
- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో స్పీకర్ తమ్మినేని, మంత్రి ధర్మాన

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని రైతులు చిరు ధాన్యాలు, వాణిజ్య పంటలు కూడా పండించేలా ప్రోత్సహించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనం నుంచి విక్రయాల వరకు రైతులకు అన్నివిధాలా ప్రభుత్వం సహకరిస్తున్న సంగతిని గుర్తుచేశారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో గతేడాది కంటే ఈ ఏడాది అధిక దిగుబడి లభించిందని, ఇది హర్షణీయమని అన్నారు. ఈ ఏడాది కూడా చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చూడాలన్నారు. లక్ష్యానికి మించి అయినా కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. చిరుధాన్యాలతో రైతులకు అధిక దిగుబడితో పాటు లాభం కూడా వస్తుందని, ఈ విషయంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ సమయంలో అతితక్కువ ఖర్చుతో డ్రోన్ల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటివి వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ఉద్యానవన శాఖ రూపొందించిన అరటి సాగుపై తోటబడి కరదీపికను, వ్యవసాయ శాఖ ముద్రించిన కరపత్రాలు, బుక్ లెట్లు, డైరీలను అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ సలహా మండలి చాలా బాగా పనిచేస్తుందన్నారు. శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైస్ మిల్లులను అదనంగా ఏర్పాటు చేయాలని కోరారు. జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లాలో 371 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రభుత్వం 4.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ఇవ్వగా.. దానికి చేరువలో ఉన్నామన్నారు. డబ్బులు కూడా త్వరగానే జమ చేస్తున్నామని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు.

వంశధార పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమల రావు మాట్లాడుతూ వంశధార కుడి,ఎడమ కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం 6.5 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఇందులో 4 టీఎంసీల వరకు నీటిని వ్యవసాయానికి వినియోగించుకోవచ్చన్నారు. ఈ నీటిని మార్చి 31వరకు అందించేందుకు అవకాశం ఉందని, తద్వారా 70వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని తెలిపారు. రైతులు కూడా తక్కువ నీటితో పండే పంటల వైపు దృష్టి సారిస్తే బాగుంటుందని సూచించారు.

సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యులు గొండు రఘురాం, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, జిల్లా వ్యవసాయ అధికారి కె.శ్రీధర్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ పి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటేస్తే తిరోగమనమే..

- కరోనా సమయంలో చంద్రబాబు లాంటి నాయకుడు ఉంటే మనకు ఆకలి చావులే గతి
- గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో చంద్రబాబుపై ధ్వజమెత్తిన మంత్రి ధర్మాన



గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: చంద్రబాబుకు ఓటేసి అధికారం ఇస్తే రాష్ట్రాన్ని తగలబెట్టేస్తాడని, అలాంటి దుర్మార్గపు ఆలోచనలు కలిగిన నాయకుడిని దూరం పెట్టాలని రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రాగోలులో శుక్రవారం జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొని చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే ఆయన చేతికి రాష్ట్ర ప్రజలంతా తుపాకీ ఇచ్చినట్టు అవుతుందని, దానితోనే జనం గుండెల్లో బుల్లెట్లు దించుతాడని అన్నారు. కొన్ని పత్రికలు, చానెళ్లు టీడీపీ కోసమే పనిచేస్తుంటాయని, వారి మాటలు నమ్మవద్దని హితవు పలికారు. ఇటీవల చంద్రబాబునాయుడు రాజాం వచ్చినపుడు మళ్లీ అధికారం కట్టబెడితే అమరావతిని రాజధాని చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పొరపాటున ఆయనకు అధికారం కట్టబెడితే మరో 50 ఏళ్లు వెనక్కి వెళ్లిపోతామన్నారు. అమరావతి అనేది చంద్రబాబు నాయుడు కోటరీకి చెందిన వ్యక్తుల సంస్థ అని, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఏర్పాటు చేశారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు అమరావతి చుట్టూ 33 వేల ఎకరాల భూములను తన వారితో కొనుగోలు చేయించారని గుర్తు చేశారు. కొత్త నగరాన్ని అభివృద్ధి చేయాలంటే మరో 50 ఏళ్లు పడుతుందని అన్నారు. విశాఖకు రాజధాని వస్తే మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయన్నారు. సీఎం వైఎస్ జగన్ విజన్ ఉన్న నాయకుడని, కరోనా సమయంలో వలంటీర్ల వ్యవస్థతో ప్రజలను ఆదుకున్నారని తెలిపారు. చంద్రబాబే అప్పుడు అధికారంలో ఉంటే ఎన్నో ఆకలి చావులను చూసేవారని చెప్పారు. కార్యక్రమంలో యువనేత ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రిమ్స్‌లో ముగ్గురు స్టాఫ్‌నర్సులకు సెలవుల్లో కోత

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న సర్వజన ఆస్పత్రిలో స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్న ముగ్గురికి సెలవుల్లో కోత విధిస్తూ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఫేషియల్ అటెండెంట్స్ తప్పనిసరి చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. అయితే రిమ్స్‌లో పనిచేస్తున్న టి.షర్మిల, ఎం.సుజాతారావు, సీహెచ్ మల్లీశ్వరి అనే స్టాఫ్‌నర్స్‌ల హాజరులో తేడాలు కనిపిస్తూ ఉండడంతో కొందరు స్టాఫ్‌నర్స్‌లు వారికి అధికారిగా ఉన్న నర్సింగ్ సూపరింటెండెంట్‌కు గురువారం ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో శుక్రవారం డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్‌కు నేరుగా ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన తొలుత జీతాలు నిలిపివేయాలని ఆదేశించారు. ఇకమీదట ఇలా జరగదని చెప్పడంతో తొలి తప్పుగా భావించి ఒక్కొక్కరికీ మూడు సెలవులను రద్దు చేయాలని ఆదేశించారు. ఫేషియల్ హాజరుకు సంబంధించి అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

ఉద్యాన పంటల తెగుళ్లపై పరిశోధన



ఉద్దానంలో కొబ్బరికి సోకుతున్న తెగుళ్లను పరిశీలిస్తున్న దృశ్యం

మందస: ఉద్దానంలో కొబ్బరి, జీడి పంటలకు సోకుతున్న తెగుళ్ల, వాటిని ఎలా నివారించాలో తెలుసుకోవడానికి ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు మందస మండలంలోని ఉద్దానంలో పర్యటించారు. సీనియర్ ఎక్స్‌టెన్సన్, డెవలప్‌మెంట్ అధికారి కృష్ణారావు, బృందం భేతాళపురం ప్రాంతంలో తోటల్లో పర్యటించి, తెగుళ్లపై పరిశోధనలు చేపట్టారు. డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు మెంబర్ బత్తిని లక్ష్మణ్ ఆధ్వర్యంలో ముందుగా ఉద్యానవన పంటలు పండిస్తున్న రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రైతుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంటలపై అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్రస్థాయిలో రైతులతో పంటలకు సోకుతున్న తెగుళ్లను పరిశీలించారు. రైతులు తాడల అప్పలస్వామి, పూజారి కామయ్య, బత్తిని ఉమాపతి తదితర రైతులతో కలసి తెగుళ్ల, నష్టం, మందులు తదితర వాటిపై ఆరా తీశారు. నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. స్థానిక రైతులకు తెగుళ్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందులను వివరించారు. అనంతరం బత్తిని లక్ష్మణ్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉద్దానంలో రైతుల కష్టాలను తీర్చడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. కొబ్బరి, జీడి పంటలకు ఇటీవల ఇబ్బంది పెడుతున్న తెగుళ్లపై యూనివర్సిటీలో పరిశోధనలు జరపాలని కోరినట్టు తెలిపారు. ఉద్దానంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానంతో రోగులకు మేలు



రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మితులసి

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో రోగులకు మెరుగైన వైద్య సేవలను, నాణ్యమైన మందులను అందజేస్తున్నామని సహాయ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.లక్ష్మీతులసి అన్నారు. శుక్రవారం స్థానిక రోటరీనగర్‌లో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. జిల్లాలో ప్రతి నెల 26 రోజుల్లో 30 ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో సుగర్, బీపీ, ఈసీజీ, ఇతర రక్త పరీక్షలు వంటి అనేక వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులను రోగులకు ఉచితంగానే అందజేస్తున్నామని తెలిపారు. గర్భిణులకు కూడా నెల నెలా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రభుత్వ జాగాపై
అక్రమార్కుల పాగా

- నరసన్నపేటలో డీసీఎంఎస్ స్థలం కబ్జాకు యత్నం
- స్థలాన్ని పరిశీలించిన డీసీఎంఎస్ అధికారులు
- పోలీసులకు ఫిర్యాదు



కబ్జాకు గురైన డీసీఎంఎస్ స్థలం



పాత గిడ్డంగులను తొలగించి నేల మట్టం చేసిన వైనాన్ని పరిశీలిస్తున్న డీసీఎంఎస్ అధికారులు

నరసన్నపేట: ఆక్రమణదారులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. నరసన్నపేట ప్రాంతంలో స్థలాలకు బహిరంగ మార్కెట్‌లో విలువ పెరగడంతో ప్రభుత్వ జాగాలపై కన్నేసి కబ్జా చేస్తున్నారు. దీంట్లో భాగంగా డీసీఎంఎస్‌కు చెందిన విలువైన స్థలంపై కొందరు వ్యక్తులు కన్నేశారు. జమ్ము రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబర్ 107/9 లో 1.76 ఎకరాల విస్తీర్ణం గల స్థలం డీసీఎంఎస్‌కు ఉంది. ఈ స్థలాన్ని జమ్ముకు చెందిన కొందరు వ్యక్తులు కాజేయడానికి ప్రయత్నించి రాత్రికి రాత్రి అక్కడ ఉన్న మొక్కలను తొలగించి పాత గిడ్డంగులను నేలమట్టం చేశారు. ఖాతా నంబర్ 963 ప్రకారం 1.76 ఎకరాల స్థలం పర్లాకిమిడి రోడ్డుకు ఆనుకుని ఉంది. ఇక్కడ సెంటు విలువ రూ.10 లక్షలకు పైగా పలుకుతోంది. ఈ విలువైన స్థలం కాజేయడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విస్తీర్ణంలో ఇప్పటికే కొంత భూమిని జమ్ముకు చెందిన వారు సాగు చేస్తున్నారు. ఈ సాగు పొలానికి ఆనుకొని ఉన్న పాత గిడ్డంగులు తొలగించి వాటిని నేల మట్టం చేసే పనికి కూడా పూనుకున్నది వారేననే అనుమానం వ్యక్తం అవుతుంది. ఈ స్థలం తమది అని సర్వ హక్కులు తమకే ఉన్నాయని ఆక్రమణదారులు వాదిస్తున్నారు.

ఈ స్థలంపై ఇటీవలే నరసన్నపేట తహసీల్దార్ ఎ.సింహాచలం రికార్డులను పరిశీలించి ఎస్ఎల్ఆర్ ప్రాప్తికి డీసీఎంఎస్ సంస్థకు పాస్ బుక్ ఇచ్చారు. వన్-బీ డీసీఎంఎస్ పేరునే వస్తోంది. ఈ సమాచారం తెలుసుకున్న ఆక్రమణదారులు గురువారం రాత్రి పాత గిడ్డంగులను తొలగించి నేలమట్టం చేసి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి చూస్తున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సింహాచలం వెంటనే స్పందించి వీఆర్వో సూర్యనారాయణను పంపి వివరాలు సేకరించారు. ఆక్రమణ నిర్ధారణ కావడంతో సమాచారాన్ని డీసీఎంఎస్ అధికారులకు తెలియజేశారు.

స్థలం పరిశీలన

తమ సంస్థకు చెందిన స్థలం అన్యాక్రాంతమవుతున్నట్లు తెలుసుకున్న బిజినెస్ మేనేజర్ పొందరి లక్ష్మణరావు, బీఎం-2 జగ్గునాయుడు, సిబ్బంది పృథ్వీ, రమేషలు శుక్రవారం సాయంత్రం స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ ఉన్న పాత గిడ్డంగులను తొలగించడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఆక్రమణదారులపై నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఈ స్థలం పక్కాగా డీసీఎంఎస్‌కు చెందినదని, పూర్తి హక్కులు వారికే ఉన్నాయని చెప్పారు.

అన్యాక్రాంతం కానివ్వం

జిల్లాలో డీసీఎంఎస్‌కు విలువైన స్థలాలు ఉన్నాయని, వీటిల్లో జమ్ము రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న స్థలం ఒకటని డీసీఎంఎస్ చైర్ పర్సన్ సల్ల సుగుణ దేవరాజ్ అన్నారు. ఈ స్థలం ఆక్రమణకు గురవుతున్నట్లు తెలుసుకున్న ఆమె శుక్రవారం స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ స్థలం వద్ద బోర్డులు పెడతామని, చుట్టూ కంచె ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్లు వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 9550311265, 8121703348.

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

చంద్రబాబు డైరెక్షన్‌లోనే
వలంటీర్లపై విషపు రాతలు

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



టెక్కలి: చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఎల్లో మీడియా వలంటీర్ల వ్యవస్థపై విషపు రాతలు రాస్తోందని, ఈనాడు పత్రికను చంద్రనాడుగా మార్చేశారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ దుయ్యబట్టారు. ఆయన శుక్రవారం టెక్కలిలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూపకల్పన చేసిన గ్రామ వలంటీర్ల వ్యవస్థ ఈ రోజు దేశానికే ఆదర్శంగా నిలిచిందనే విషయాన్ని ఈనాడు అధినేత రామోజీరావు గుర్తించకపోవడం ఆయన అనుభవానికి పెద్ద మచ్చ అని అన్నారు. వలంటీర్ల వ్యవస్థను కించ పరిచే విధంగా చంద్రబాబు డైరెక్షన్‌లో ఈనాడులో తప్పుడు రాతలు రాయడంతో ఆ పత్రికపై ప్రజల్లో ఉన్న కాస్త గౌరవం తగ్గిపోయిందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చేసిన విధ్వంసాలు ఈనాడు పత్రిక అధినేత రామోజీరావుకు కనిపించలేదా అని దువ్వాడ ప్రశ్నించారు. ఎంతో మంది అర్హత కలిగిన లబ్ధిదారులకు అన్యాయంగా పింఛన్లు నిలిపివేసినపుడు రామోజీ కళ్లు మూసుకున్నారా అని ప్రశ్నించారు. ప్రజల పక్షాన పోరాటం చేయకుండా చంద్రబాబుకు అనుకూలంగా ఈనాడులో విషపు రాతలు రాయడం అప్రజాస్వామికమన్నారు. ఒకప్పుడు చంద్రబాబుకు అధికారం దక్కించడానికి ఇదే ఈనాడు రామోజీరావు దివంగత నేత ఎన్టీఆర్‌పై తప్పుడు కథనాలు రాసిన సంఘటనలను దువ్వాడ గుర్తు చేశారు. ఇకనైనా చంద్రబాబుకు ఊడిగం చేయకుండా ప్రజల పక్షాన నిలబడాలని లేకుంటే ప్రజల నుంచి తగిన గుణపాఠం తప్పదని ఎమ్మెల్సీ దువ్వాడ హెచ్చరించారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఆమె శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ప్రజలు ప్రభుత్వ పథకాలు పొందాలంటే ప్రభుత్వ అధికారులు, టీడీపీ నాయకుల చుట్టూ తిరిగేవారని అయినా కూడా అర్హులకు పథకాలు అందేవి కావన్నారు. నేడు ప్రభుత్వం 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వారి ముంగిటకు చేరుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారులే ప్రజల వద్దకు వెళ్లాలి అనే లక్ష్యంతోనే సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. సంక్షేమ పథకాలు వందశాతం పేదలకు అందాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. సచివాలయంలోనే 700 సేవలను అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన నియోజకవర్గం పాతపట్నం అని, అందుకే సీఎం ప్రత్యేకించి నియోజకవర్గం దృష్టి పెట్టి నిధులు కేటాయిస్తున్నారన్నారు. నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా రూ.900 కోట్లు సంక్షేమ పథకాలకు నిధులు అందించారన్నారు. జిల్లాలో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధుల వల్ల ఇబ్బందులు పడుతున్నారని, దీనికి తాగునీటి సమస్య కారణమని భావించి సీఎం ఏడు మండలాలకు వంశధార ప్రాజెక్టు ద్వారా తాగునీటి కోసం రూ.750 కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నం, హిరమండలం, మెళియాపుట్టి మండలాలకు తాగునీటి కోసం ప్రత్యేకించి రూ.216.71కోట్లు నిధులు ఇచ్చారన్నారు. గిరిజనులకు కోసం అటవీ పరిధిలోని భూములకు పోడు పట్టాలను అందించారన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటుకు సీఎం హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఆమెతో పాటు ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, దేవాంగుల కార్పొరేషన్ డైరెక్టర్ మంచు చంద్రయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎనుగతల సూర్యం, కె.లక్ష్మినారాయణ, పనుకు మోహన్, తూలుగు ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి తైక్వాండో శ్రీను తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్ సమీపంలో ఉన్న వైఎస్సార్ కల్యాణ మండపం వేదికగా ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలు మొదలవుతాయన్నారు. క్యాడెట్స్, సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ నాలుగు వయో విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహించి బహుమతులను అందజేయనున్నట్టు చెప్పారు. జూనియర్స్, క్యాడెట్స్ విభాగాల్లో ఎంపికైన క్రీడాకారులను అనకాపల్లిలో ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు పంపించనున్నట్టు తెలిపారు. అలాగే జూనియర్స్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులను ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. అక్కడ రాణించిన క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికవుతారని తైక్వాండో శ్రీను వెల్లడించారు. శనివారం ఉదయం 10 గంటల్లోగా తమ వివరాలను నమోదుచేసుకోవాలని, మరిన్ని వివరాలకు 89195 91457 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

చౌదరికి ఆత్మీయ స్వాగతం



చౌదరి పురుషోత్తమనాయుడును అభినందిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షునిగా 5వ సారి బాధ్యతలు చేపట్టి శుక్రవారం జిల్లాకు చేరుకున్న చౌదరి పురుషోత్తమనాయుడుకు ఏపీ ఎన్జీవో సంఘ నేతలు, ఉద్యోగులు ఘనస్వాగతం పలికారు. శ్రీకాకుళంలోని సాయిబులతోటలోని ఆయన స్వగృహం వద్ద సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. హనుమంతు సాయిరాం మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో పురుషోత్తమనాయుడు ముందుంటారని అన్నారు. ఎన్జీఓ సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు మాట్లాడుతూ తనపై విశ్వాసంతో మరోమారు సహాధ్యక్షునిగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగ సంఘ నేత కేఆర్ సూర్యనారాయణ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి గవర్నర్‌ను కలవడాన్ని ఆయన ఖండిస్తూ.. ఇది ఉద్యోగులను తప్పుదారి పట్టించడమేనని పేర్కొన్నారు. సూర్యనారాయణ రాజకీయ ప్రయోజనాల కోసమే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో ఉద్యోగులు మరింత నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాలు పరిమితులకు లోబడే ఎలాంటి కార్యక్రమమైనా చేపట్టాల్సి ఉందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లను రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించామని, ఆయన కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఏపి ఎన్జీవో సంఘం కృషి చేస్తుందన్నారు.

కమ్మసిగడాం జాతర వాల్ పోస్టర్ ఆవిష్కరణ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాంలో వెలసిన శ్రీ మహాలక్ష్మి తల్లి జాతర ఈ నెల 30, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కమ్మసిగడాం ఆలయ ప్రాంగణంలో జాతరకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర, ఒడిశా నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఆట ఆదుర్స్

- అట్టహాసంగా ప్రారంభమైన 66వ ఏపీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



మాట్లాడుతున్న డీఈఓ గార పగడాలమ్మ, పక్కనే ఎంపీ పద్మావతి, రవికుమార్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరిగే 66వ ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్-14,17,19 బాలబాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఎస్‌జీఎఫ్ నిర్వహణ కమిటీ ప్రతినిధులు నాణ్యమైన వసతి, భోజన సదుపాయాలు కల్పించారు. రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు పోటెత్తారు. తొలిరోజు వైఎస్సార్ కడప, గుంటూరు, విశాఖ, కృష్ణ, తూర్పు గోదావరి, చిత్తూరు తదితర జిల్లాల క్రీడాకారులు పతకాలతో సత్తాచాటుతున్నారు. ముందుగా ఈ పోటీలను డీఈఓ గార పగడాలమ్మ, శ్రీకాకుళం మున్సిపల్‌మాజీ చైర్ పర్సన్ ఎంపీ పద్మావతి సంయుక్తంగా ప్రారంభించారు. క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని, క్రీడా సర్టిఫికెట్ ద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు పక్కాగా, పారదర్శకంగా లభిస్తున్నాయని చెప్పారు. క్రీడాస్ఫూర్తితో రాణించాలని, మంచి జ్ఞాపకాలను మీ వెంట తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అరబిందో ఫార్మా సంస్థ, ఇతర దాతలు కొంత సాయాన్ని అందించి బాసటగా నిలిచారు.

ఆకట్టుకున్న మార్చ్‌పాస్ట్..

అంతకుముందు వివిధ జిల్లాల క్రీడాకారులు ప్రదర్శించిన మార్చ్‌పాస్ట్ ఆకట్టుకుంది. క్రీడాకారుల నుంచి అతిథులు, అధికారులు గౌరవ వందనాన్ని స్వీకరించారు. క్రీడాజ్యోతిని ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, చీఫ్ కోచ్ ఎం.మాధురీలత వెలిగించారు. క్రీడల జెండా, స్కూల్‌గేమ్స్ జెండాలను డీఈఓ పగడాలమ్మ, ఎంపీ పద్మావతి ఆవిష్కరించారు.

వాటర్ ప్లాంట్ తనిఖీ

లావేరు: మండలంలోని సుభద్రాపురం గ్రామంలో గల రెహా వాటర్‌ప్లాంట్‌లో శుక్రవారం విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ నిర్వహించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కె.వెంకటరత్నం, విజిలెన్స్ ఏఈ రవికుమార్, విజిలెన్స్ ఎస్ఐ రామారావులు వాటర్ ప్లాంట్‌లో తనిఖీలు నిర్వహించారు. ప్లాంట్‌లో తయారు చేస్తున్న వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లను పరీక్షల కోసం తీసుకెళ్లారు. నిబంధనలు పాటించని కారణంగా యాజమాన్యంపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹205	₹ 225